హెచ్ఐవీ రోగులకు భరోసా

ఐసీటీసీ కేంద్రం



వ్యాధి గురించి బయటకు చెప్పాలన్నా ఇబ్బంది.. డాక్టర్ సలహా తీసుకోవాలన్నా ఎవరికైనా తెలుస్తుందేమో అనే భయం.. చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకం.. ఇలా.. హెచ్ఐవీ రోగుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉండేది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వారి పాలిట వరంగా మారాయి ఐసీటీసీ కేంద్రాలు. బతుకుపై భరోసానిస్తూ, రోగుల వివరాలపై గోప్యత పాటిస్తూ ఏర్పడిన ఈ కేంద్రాల రాకతో వారి జీవితాల్లో మళ్లీ వసంతం చిగురించింది. భీమిలిలోని ఐసీటీసీ కేంద్రంలో కౌన్సెలర్ గైడెన్స్, ఖరీదైన మందులు ఉచితంగా అందించడంతో రోగులకు స్వస్థత చేకూరి, సాధారణ జీవితం గడుపుతున్నారు. క్రమంగా రోగుల సంఖ్యా తగ్గడం మంచి పరిణామం.



- నెలకు 400 నుంచి 600 మందికి పరీక్షలు
- నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు
- గణనీయంగా తగ్గిన కేసులు
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ రోగుల కోసం ఏర్పాటు చేసిన సమీకృత సలహా మరియు పరీక్ష కేంద్రం(ఐసీటీసీ) వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఎయిడ్స్ వ్యాధి బాగా వ్యాప్తి చెందుతున్న సమయంలో దాన్ని అరికట్టడంతో పాటు దీనిపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 2006లో నియోజకవర్గ స్థాయిలో ఇక్కడ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఒక కౌన్సెలర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. హెచ్ఐవీ లక్షణాలు ఉన్న రోగులు ఇక్కడికి వస్తే వారికి ప్రత్యేకంగా ఉన్న కాంబ్ ఎయిడ్స్ కిట్స్ ద్వారా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో వ్యాధి నిర్ధారణ అయిన వారిని కౌన్సెలర్ వద్దకు పంపించడంతో వారికి ధైర్యాన్నివ్వడంతో పాటు ఎంతో ఖరీదైన యాంటీ వైరల్ రెట్రో థెరపీ (ఏఆర్‌టీ) మాత్రలను ఉచితంగా అందిస్తున్నారు. దాంతోపాటు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి, ఏ ఆహారం తీసుకోవాలి అనేది తెలియజేస్తున్నారు. హెచ్ఐవీ రోగులు గతంలో మందులు తీసుకోవాలంటే తప్పనిసరిగా విశాఖ వెళ్లాల్సి వచ్చేది. కాని కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడే వాటిని అందిస్తున్నారు. ముఖ్యంగా రోగులకు సంబంధించిన వివరాలను ఎంతో గోప్యంగా ఉంచుతున్నారు.



కేంద్రంలో హెచ్ఐవీ పరీక్ష కిట్లు



రోగుల కోసం సిద్ధంగా ఉంచిన మందులు



ల్యాబ్‌లో హెచ్ఐవీకి సంబంధించిన రక్త పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

తగ్గిన రోగుల సంఖ్య

ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన పది సంవత్సరాల వరకు నెలకు 20 నుంచి 30 వరకు పాజిటివ్ కేసులు వచ్చేవి. కానీ తరువాత నుంచి ఈ వ్యాధిపై అందరికీ బాగా అవగాహన కలగడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవడంతో వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం సంవత్సరానికి పది కేసులు కూడా నమోదు కావడం లేదు.

రోగులకు ప్రతి నెలా మందులు

ప్రస్తుతం కేంద్రంలో పాతవారితో కలిపి 70 మంది మందులు తీసుకుంటున్నారు. వారికి నెలకు సరిపడా మాత్రలు అందిస్తున్నారు. వారు నెల తరువాత తిరిగి వస్తే మళ్లీ ఇస్తున్నారు. ఇలా ప్రతి నెలా వచ్చిన వారికి మాత్రలు ఇవ్వడంతో పాటు ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్నారు. ఇక్కడి కౌన్సెలర్ భీమిలి పరిధిలోని మధురవాడ, రేవిడి, ఆనందపురం, తాళ్లవలస ప్రాంతాల్లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడికి వచ్చే రోగులకు, అలాగే పలు కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలా ఇక్కడ ఐఆర్‌టీసీ కేంద్రం హెచ్ఐవీ రోగులకే కాకుండా ఇతరులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సెలర్ వెంకటరాజు

గర్భిణులకు తప్పనిసరిగా పరీక్షలు

ప్రతిరోజు ఇక్కడికి పలు ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులకు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నారు. ఇందులో ఎవరికైనా వ్యాధి నిర్ధారణ జరిగితే, గర్భంలోని పిల్లలకు వ్యాధి సోకకుండా అవసరమైన మందులు, చికిత్స అందిస్తున్నారు. ఇలా ప్రతి నెలా గర్భిణులతో పాటు ఇతరులకు కలిసి 400 నుంచి 600 మందికి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన కిట్లు, రోగులకు అవసరమైన మాత్రలు కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం



ఇక్కడికి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే సాధారణ రోగులతో పాటు, గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పరీక్షలు ఎంతో జాగ్రత్తగా జరుగుతాయి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు ఇవ్వడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచి, తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రస్తుతం పాతవారితో కలిపి 70 మంది ప్రతి నెలా మందులు వాడుతున్నారు. ఇందులో 30 మంది 10 సంవత్సరాల నుంచి మందులు తీసుకుంటున్నారు. దీర్ఘకాల రోగులకు పౌష్టికాహారం కోసం ప్రతి నెలా రూ.4 వేలు పెన్షన్ కూడా ఇస్తున్నారు. – రావి వెంకటరాజు, ఐసీటీసీ కౌన్సిలర్

క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

తగరపువలస: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం సంగివలస అనిల్ నీరుకొండ ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ మాట్లాడుతూ టేక్ ది రైట్ పాత్, మై హెల్త్.. మై రైట్ నినాదాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు రెడ్ రిబ్బన్ నమూనాగా ఏర్పడ్డారు. ర్యాలీలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఆర్ శరత్‌బాబు, ప్రొఫెసర్ కేవీ చక్రధర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చెంచురెడ్డి, అధ్యాపకులు, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో శనివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. తగరపువలసకు చెందిన అరవింద్ కుమార్ తన కుమార్తెను రుషికొండలోని ఓ కళాశాలకు ద్విచక్ర వాహనంపై తీసుకుని వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా ఎర్రమట్టి దిబ్బల సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అరవింద్‌కు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి ఆయనను తరలించారు.

సత్యనారాయణపేటలో అన్నదానం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు శ్రీరమాసత్యనారాయణస్వామి కొండపై గల శివాలయం వద్ద శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకుడు ఏడిద వివేకానంద శర్మ, కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి 4 వేల మంది భక్తులు పాల్గొని, అన్నప్రసాదాలు స్వీకరించారు.

బీచ్ రోడ్డులో కారు ప్రమాదం



ప్రమాదంలో నుజ్జయిన కారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ మొగదారమ్మ ఆలయం సమీపంలో శనివారం ఉదయం ఒక కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. విశాఖపట్నం నుంచి భీమిలి వైపు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో కారు ముందు భాగం నుజ్జయింది. ప్రమాద సమయంలో కారు ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

600 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి దీపోత్సవంలో భాగంగా పద్మనాభంలో శనివారం గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ప్రారంభించిన శిబిరంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వైద్యపరీక్షలు చేశారు. ఉజ్వల ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గురజాడకు నివాళులు



గురజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తాటితూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

తగరపువలస: గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల, తాటితూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, కె.సన్యాసి నాయుడు గురజాడ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సంజీవి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు

కొమ్మాది: గీతంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా వ్యర్థాల నిర్వహణ సర్క్యులర్ ఎకానమీపై నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె. ఘోష్ మాట్లాడుతూ దేశంలో 3లక్షల 91 వేల మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలు పోగు పడుతున్నాయని, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ పద్ధతిలో తిరిగి ఉపయోగించడంలో యూరప్ దేశాల విధానాలను అనుసరించాల్సి ఉందని తెలిపారు. దేశంలో 4.5 శాతం గ్రీన్ హౌస్ ఉద్గారాలకు ఔషధ పరిశ్రమలే కారణం అన్నారు. ఔషధాల ప్యాకింగ్, వినియోగించని మందుల రీసైక్లింగ్, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉదార్గరాల శాతాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఔషధ పరిశ్రమ నిపుణులు పి. రామారావు, ఓక్సెన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ డిజైన్ పరిశోధకులు ఎస్.రవికుమార్, గీతం డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ముగ్గురికి రిమాండ్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పెద ఉప్పాడకు చెందిన పిరిడి రాము, బమ్మిడి అజయ్ అలియాస్ ఎర్రయ్య, చిల్ల అప్పలరాజు అలియాస్ పండును కొట్లాటకు సంబంధించి భీమిలి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే గ్రామానికి చెందిన కారి రాముతో పిరిడి రాముకు గతంలో గొడవలు ఉండేవి. అందులో భాగంగా గత నెల 28న వీరిద్దరూ కర్రలు, బీరు సీసాలతో కొట్టుకున్నారు. ఈ పరస్పర దాడులలో అజయ్, అప్పలరాజు కూడా పాల్గొన్నారు. అనంతరం పిరిడి రాము, కారి రాము పరస్పరం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి, ఎస్ఐ ఎన్.గౌరి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోస్తని తీరంలో పోలి పాడ్యమికి ఏర్పాట్లు



నదిలోపలికి వెళ్లకుండా కర్రలతో రక్షణ ఏర్పాటు

తగరపువలస: ఈ నెల 2న పోలి పాడ్యమి సందర్భంగా భీమిలి మండలం టి.నగరపాలెం గోస్తని నది తీరంలో స్నానాలఘాట్ వద్ద పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం వేకువజామున పెద్ద ఎత్తున మహిళలు నదీస్నానం ఆచరించి, అరటిదవ్వలతో నదిలో దీపాలు వదులుతారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గం ఘాట్ పరిసరాలతో పాటు నదిని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించింది. నది లోపలికి వెళ్లకుండా కర్రలతో రక్షణ ఏర్పాటు చేశారు. ఘాట్‌లో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు, టెంట్లు వేశారు. అనంతరం మహిళలు, భక్తులు పూజా కార్యక్రమాల నిర్వహణకు వినాయకుడు, శివుడు విగ్రహాలతో పాటు శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి తెలిపారు. ఇటీవల దివీస్ లేబొరేటరీ స్నానాలఘాట్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా టాయిలెట్లు, ఘాట్‌లో మెట్లు, రెయిలింగ్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

సనాతన ధర్మాన్ని సంరక్షించాలి

- మందిరాలకు భద్రత కల్పించాలి
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజదాస
- బంగ్లాదేశ్‌లో శాంతికోసం సంకీర్తనలు



బంగ్లాదేశ్‌లో మతఛాందస వాదులకు నిరసనగా సంకీర్తనలు

తగరపువలస: సనాతన ధర్మాన్ని సంరక్షించే తమతో పాటు మందిరాలకు భద్రత కల్పించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజదాస బంగ్లాదేశ్ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. దేశద్రోహానికి సంబంధించి నిరాధార ఆరోపణలను ఇస్కాన్, హరేకృష్ణ మూవ్‌మెంట్‌పై మత ఛాందసవాదులు మోపి ఒంటరి చేయాలని కుట్రలు జరుగుతున్నాయని, ఈ అన్యాయమైన దాడులు ఎదుర్కోవడానికి ప్రపంచ వ్యాప్తంగా భక్తులు సంఘీభావం తెలియజేయాలని కోరారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం వీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నాలుగో రోజైన శనివారం లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా బంగ్లాదేశ్‌లోని శాంతి కోసం సంకీర్తనలు ఆలపించారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. తొలిదీపాన్ని యదురాజ దాస వెలిగించారు. వైకుంఠ శ్రీనివాసునికి, దామోదర కృష్ణునికి భక్తులు నెయ్యి దీపాలతో హారతులు ఇచ్చారు. అనంతరం యదురాజా దాస భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో సనాతన ధర్మాన్ని ఆచరించే, ప్రచారం చేసే స్వేచ్ఛకోసం తాము గట్టిగా వాదిస్తామన్నారు. మత ఛాందసవాదుల నుంచి సనాతన ధర్మం పాటించే భక్తులను రక్షించాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. భక్తులు హరేకృష్ణ నామ స్మరణతో బంగ్లాదేశ్‌లో శాంతికోసం సంకీర్తన నిర్వహించారు. చివరగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సోషల్ మీడియాను దుర్వినియోగం చేయొద్దు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ ఎస్ఐ మహేశ్వరరావు

తగరపువలస: సోషల్ మీడియా ద్వారా ఇతరులను కించపరచడం, దూషించడం వంటివి చేసి, దుర్వినియోగం చేయవద్దని నగరానికి చెందిన సైబర్ క్రైమ్ ఎస్ఐ ఇ.మహేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. కేవలం చదువుకోవడానికే వినియోగించాలని హితవు పలికారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు సోషల్ మీడియాతో పాటు సైబర్ బెదిరింపుల గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత విషయాలను, ఫొటోలను తెలియని వ్యక్తులతో పంచుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. సోషల్‌మీడియాలో ఆకర్షణలకు ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే అధ్యాపకులు, తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. బ్యాంకింగ్ రంగం, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలలో జరిగే మోసాల గురించి తెలియజేశారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురయితే 1930 నంబరు లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రశాంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెరిపివ్వని వాన





మారికవలసలో గొడుగులతో రాకపోకలు



జలమయమైన రుషికొండ చిల్డ్రన్ పార్క్

తుపాను కారణంగా శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా భీమిలి నియోజకవర్గంలో పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. భీమిలి జోన్‌లో డ్రైనేజీలు లేని ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ, సంగివలస, ఊళ్లపేట, నమ్మివానిపేట గ్రామాలు నీట మునిగాయి. జాతీయరహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్ల వెంట డ్రైనేజీలు పూడుకుపోవడంతో యథావిధిగా వర్షం నీరు రహదారిపై నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వర్షం ధాటికి సంగివలస డ్రైనేజీల నుంచి సర్వీస్‌రోడ్డు పైకి మురుగునీరు అడుగున్నర మేరకు ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు వెనుదిరగ వలసి వచ్చింది. ఆనందపురం మండలంలోని విశాఖ, పెందుర్తి వైపు సర్వీస్‌రోడ్లపై పలుచోట్ల వర్షంనీరు రెండు అడుగుల వరకు నిలిచిపోయింది. దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు మొరాయించాయి. రుషికొండ బీచ్‌లో పర్యాటకులను మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డ్స్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. ఇప్పటికే బోటు షికారు నిలిపివేశారు. చిల్డ్రన్ పార్కు జలమయమైంది. తీరంలో సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. మంగమారిపేట, ఉప్పాడ, రుషికొండ, భీమిలి ప్రాంత మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించారు. తీర ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. - తగరపువలస/మధురవాడ/ పీఎం పాలెం/కొమ్మాది

వ్యక్తిపై దాడి కేసులో నలుగురి అరెస్ట్

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ చిననాగమయ్యపాలెం గ్రామానికి చెందిన బొడ్డు నరసింగరావు, బొడ్డు అప్పలరాజు, బొడ్డు ధనరాజు, బొడ్డు అప్పారావులను భీమిలి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భీమిలి సీఐ బి.సుధాకర్ తెలియజేసిన వివరాల ప్రకారం నిందితులలో బొడ్డు నరసింగరావు గ్రామంలో మరొక వ్యక్తి బొడ్డు నరసింగరావుకు గతంలో రూ.2వేలు అప్పుగా ఇచ్చాడు. గత నెల 28న నిందితుడు నరసింగరావు, తన వద్ద అప్పు తీసుకున్న నరసింగరావు ఇంటికి వెళ్లి అప్పు తీర్చమని కోరాడు. తన వద్ద డబ్బులు లేవని తరువాత ఇస్తానని బాధితుడు సమాధానం ఇచ్చాడు. దీంతో వెళ్లిపోయిన నిందితుడు అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో మరో ముగ్గురు నిందితులతో కలిసి నరసింగరావు ఇంటిపై దాడి చేసి కర్రలతో చితకబాదారు. దీంతో కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

తగరపువలస ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీకి చెందిన లెంక హరీష్ ఎంవీపీ కాలనీలో పని ఉందంటూ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు అతని మేనమామ బొద్దపు అప్పారావు ఆనందపురం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. హరీష్ ఫోన్ లొకేషన్ ఆధారంగా అతను చినవాల్తేరులో ఉన్నట్లు గుర్తించిన హెడ్ కానిస్టేబుల్ గాంధీ అతడిని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాలల గర్జన పోస్టర్ ఆవిష్కరణ

పీఎం పాలెం: ఎస్సీల వర్గీకరణను రాష్ట్రాలకు బదలాయిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని మాల సామాజిక వర్గం నాయకులు పేర్కొన్నారు. కొమ్మాదిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం డిసెంబర్ 8వ తేదీన గురజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక నాయకులు పతివాడ రాంబాబు, షిప్పింగ్ కార్పొరేషన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కేఎస్‌పీ చక్రవర్తి, సియాద్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయం వద్ద శనివారం గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో దీపారాధన జరిగింది. గ్రామంలో మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని శివ పంచాక్షరిని పఠించారు. శివకేశవులను కీర్తిస్తూ పాటలు పాడారు.

మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ



సైబర్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం మహిళా పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులిచ్చేందుకు వచ్చే మహిళలకు, వారి పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతుల ను గమనించారు. ఫిర్యాదులను పరిష్కరిస్తున్న తీరును తెలుసుకున్నారు, కుటుంబ కలహాలతో వచ్చే పలు జంటలకు ఇస్తున్న కౌన్సెలింగ్ విధానాన్ని పరిశీలించి, అక్కడి మహిళల అభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం మహిళా పోలీస్ స్టేషన్ పై అంతస్తులో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విద్యార్హతలు, వారు వినియోగిస్తున్న సాఫ్ట్ వేర్లను, వాటిపై వారికున్న పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ ల్యాబ్‌ను, అందులోని సాంకేతికతను పరిశీలించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండేందుకు సైబర్ క్రైమ్‌పై మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

ఆద్యంతం.. ఆధ్యాత్మిక పరిమళం







అనంతుని దీపోత్సవం ఆద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లింది. భక్తి పారవశ్యంతో ప్రతీ మెట్టుపై వెలిగించిన దీప కాంతుల్లో పద్మనాభం దేదీప్యమానంగా ప్రకాశించింది. చిడతలు, తప్పెటగుళ్లు, పులివేషాలు అలరించాయి. కుంతీ మాధవ స్వామి, నారాయణేశ్వరస్వామి ఆలయాలు విద్యుద్దీపాలతో వెలుగొందాయి. అయితే, తుఫాన్ ప్రభావం వల్ల శనివారం రాత్రి ఏడున్నర గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో భక్తులు తడిసి ముద్దయ్యారు. గిరిపై భక్తులు, గిరి దిగువన భక్తులు చెల్లా చెదురయ్యారు. ఎనిమిది గంటల సమయంలో కరెంటు నిలిచిపోయి, కారు చీకట్లు కమ్ముకోవడంతో అవస్థలు పడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ దంపతులు బొడ్డు అప్పలకొండమ్మ, బొడ్డు అప్పలనాయుడు, తహసీల్దార్ కె.ఆనందరావు, సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కె.దామోదరరావు పాల్గొన్నారు. – పద్మనాభం